సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం ၊ 9 ၊ జూలై ၊ 2024



తగ్గిన చీనీ ధరలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



స్థిరంగా టమాట ధరలు
టమాట ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది.

గరిష్టం/కనిష్టం
34.2°/22.8°

జిల్లా పరిధిలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

తలుపుల : మండలంలో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకొనేలా చూడాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. సోమవారం తలుపుల పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పీర్ల పండుగ సందర్భంగా ఎలాంటి గొడవలకూ ఆస్కారం లేకుండా పోలీసులు నిఘా ఉంచి, అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రైం రేటు, గ్యాంబ్లింగ్, సారా, ఫ్యాక్షన్ తదితర విషయాలపై రూరల్ సీఐ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకొన్నారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. గ్రామాల్లో ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని సూచించారు. రౌడీషీటర్స్, ట్రబుల్ మాంగర్స్ కదలికలపై నిఘా పెట్టి.. గ్రామాల్లో రాత్రి వేళ గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఎవరైనా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి



బాధితులతో కలిసి ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం పుట్టపర్తి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడి చేసిన టీడీపీ కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బాధితులతో కలిసి సోమవారం ఎస్పీని కార్యాయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తచెరువు మండలం మైలసముద్రం, లోచర్ల, యర్రపల్లి, బుక్కపట్నం మండలం కొత్తకోట, బిట్రగుంటపల్లి, పాముదుర్తి గ్రామాల్లో కొంతమంది టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైన, వారి ఇళ్లపైన దాడులు చేస్తున్నారన్నారు. వ్యవసాయ పంపుసెట్లు, పరికరాలు, తోటల నరికివేత వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. దాడులకు సంబంధించి ఆధారాలతో మీకు అందజేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పుట్టపర్తి, కొత్తచెరువు ఎంపీపీలు ఎ.వి.రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, యువజన విభాగం నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మండల మాజీ కన్వీనర్ గంగాద్రి పాల్గొన్నారు.

దాడులు ఆపకపోతే ప్రతిఘటనే

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ కార్యకర్తలు దాడులు ఆపకపోతే ప్రతిఘటన తప్పదని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన సోమవారం బుక్కపట్నంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం తాను కొత్తకోట, బిట్రగుంటపల్లిలో గ్రామంలో తమ పార్టీ వారిని పరామర్శించి, వెళ్లిపోగానే టీడీపీ నేతలు సర్పంచ్ నాగమణి, కొత్తకోట కేశప్ప దంపతుల కారు, ఇంటిపైకి రాళ్లు రువ్వి, ఆమె అత్త చెన్నమ్మ, పార్టీ నాయకుడు నరసింహయ్యపై దాడులకు పాల్పడటం దారుణమన్నారు. హింసకు స్వస్తి చెప్పి ప్రజలకు మంచి చేయడంపై దృష్టి పెట్టకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎల్‌ఐసీ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిను మరువం రాజన్నా





బుక్కపట్నంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



హిందూపురంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

- రైతుల కుటుంబాల్లో చెరగని ముద్ర
- ఉచిత వ్యవసాయ విద్యుత్‌తో రైతులకు అండ
- ఫీజు రీయింబర్స్‌మెంటుతో ఉన్నత చదువులు
- ఆరోగ్యశ్రీ, అంబులెన్సు సేవలతో నూతన ఒరవడి
- వైఎస్సార్ 75వ జయంతి వేడుకల్లో కొనియాడిన వైఎస్సార్‌సీపీ నేతలు

ప్రశాంతి నిలయం: ప్రజల గుండెల్లో రాజన్న బతికే ఉన్నారు. ప్రతి రైతుకూ ఉచిత విద్యుత్ రూపంలో అండగా నిలిచారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఎందరో పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు తోడ్పాటు అందించారు. ఆరోగ్యశ్రీతో ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించి ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. అంబులెన్సుల ద్వారా అత్యవసర సేవలు తీసుకొచ్చారు. ఆయన ప్రవేశపెట్టి అమలు చేసిన ప్రతి పథకమూ ప్రజల్లో మెదులుతూనే ఉంది. భౌతికంగా దూరమైనా ప్రజల గుండెల్లో, పలు పథకాల రూపంలో ఆయన బతికే ఉన్నారు. 'నిన్ను మరువబోం రాజన్నా' అంటూ అభిమానులు వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని జిల్లా వ్యాప్తంగా పండుగలా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. జోహార్ రాజన్నా.. అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చి సంబరాలు చేసుకున్నారు.

- మడకశిరలో మాజీ మంత్రి నర్సేగౌడ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత నర్సేగౌడ మాట్లాడుతూ వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికీ అండగా నిలిచిన తొలి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అన్నారు.
- హిందూపురంలోని ప్రధాన కూడలిలో వైఎస్ విగ్రహానికి పార్టీ సమన్వయకర్త టీఎన్ దీపిక పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె అన్నదానం చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎందరికో ఆదర్శంగా నిలిచారని దీపిక కొనియాడారు. అక్కడే కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.
- పెనుకొండలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, మున్సిపల్ చైర్మన్ ఉమర్ ఫరూక్ ఆధ్వర్యంలో మడకశిర రోడ్డులో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.
- ధర్మవరంలో 40 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో వైఎస్ జయంతి నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల గుండెల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేసుకున్నారని నాయకులు కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.
- పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. నల్లమాడ, బుక్కపట్నం మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో ఉన్న వైఎస్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు.
- కదిరి మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.
- రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండల కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయా మండలాల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.



ధర్మవరంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కదిరిలో వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, నాయకులు



గోరంట్లలో వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



మడకశిరలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నర్సేగౌడ, సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు

పింఛన్లపై పెత్తనం

మెరుగైన పాలన అందిస్తామని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని కూటమి (టీడీపీ–జనసేన–బీజేపీ) అధికారంలోకి వచ్చింది. ప్రజలు తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేది పోయి తద్భిన్నంగా వ్యవహరిస్తోంది. తమకు ఓటు వేయలేదని, వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారని గుర్తించిన వారికి పింఛన్లు పంపిణీ చేయకుండా అధికార టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు. ఇందులోనూ రామగిరి, బత్తలపల్లి, ధర్మవరం తదితర మండలాల్లో ఇటువంటివి అధికంగా జరుగుతున్నాయి.

- కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణ
- వృద్ధులు, మహిళలు, దివ్యాంగులపైనా కర్కశమే
- టీడీపీ నేతల ఒత్తిడితో అధికారులకు ఇక్కట్లు
- రామగిరి, బత్తలపల్లి, ధర్మవరం ప్రాంతాల్లోనే అధికం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో 2,70,973 మంది సామాజిక భద్రత పింఛన్లు పొందుతున్నారు. ఈ నెల వీరికి పింఛన్ పంపిణీ కోసం ప్రభుత్వం రూ.184.71 కోట్ల నిధులు విడుదల చేసింది. రెండు రోజులు మాత్రమే పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంకా 3,046 మందికి పింఛన్లు అందాల్సి ఉంది. వారంతా సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాలు, డీఆర్‌డీఏ కార్యాలయం వెళ్లి తమ గోడు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. చివరగా కలెక్టరేట్‌కు వస్తున్నారు. అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులపై అంత కర్కశం ఎందుకు చూపుతున్నారయ్యా అంటూ విలపిస్తున్నారు.

ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

రామగిరి మండలంలో 290 మందికి అర్హత ఉన్నా పింఛన్ పంపిణీ చేయలేదు. దీంతో ఆయా లబ్ధిదారులు పింఛన్ అందక కుటుంబ పోషణ భారమైందని సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను ఫిర్యాదు చేశారు. వచ్చే నెలలోనైనా రెండు నెలల పింఛన్ డబ్బు వచ్చేలా చూడాలని కోరారు. పింఛన్‌దారులకు న్యాయం చేయకపోతే తాము ఆందోళన చేపట్టాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఇన్‌చార్జ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో రామగిరి జెడ్పీటీసీ సభ్యుడు నాగార్జున, సర్పంచ్ మీనుగ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, వైస్ సర్పంచ్ రామాంజనేయులు, జేసీఎస్ కన్వీనర్ వెంకటరెడ్డి, మాజీ కన్వీనర్ రమేష్, పింఛన్‌దారులు ఉన్నారు.



ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న పింఛన్‌దారులు

విచారణ చేయిస్తా

వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు పింఛన్లు పంపిణీ చేయకుండా ఎందుకు ఉన్నారో విచారణ చేయిస్తా. డీఆర్‌డీఏ పీడీ నరసయ్యను పిలిచి కారణాలు తెలుసుకుని.. ఫిర్యాదులపై విచారణకు ఆదేశించారు. రెండు నెలల పింఛన్లు వచ్చే నెలలో వచ్చేలా చూస్తానని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

ఇబ్బంది పెట్టడం సరికాదు



వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమనే సాకుతో టీడీపీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి మాకు పింఛన్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. మండలంలో వందలాది మందికి ఇవ్వలేదు. మంచి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇలా కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదు. వచ్చే నెలలోనైనా రెండు నెలల పింఛన్ పంపిణీ చేయించాలని కలెక్టర్‌ను కోరాం.

– శ్రీనివాసులు, గరిమేకలపల్లి

ఈ వయసులో మాకేంటీ సమస్య?



నాకు 80 ఏళ్ల వయసు ఉంటుంది. ఇన్నేళ్లలో ఎన్నడూ పింఛన్ ఆపింది లేదు. మొదటిసారిగా ఇప్పుడే అలాంటి చర్యలు చూస్తున్నాం. నాలాంటి ఎంతోమంది పింఛన్ డబ్బుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో ఒక్క పింఛన్ కూడా తొలగించలేదు. టీడీపీ వాళ్లు వచ్చీ రాగానే ఇబ్బంది పింఛన్ రాకుండా అడ్డుకుంటున్నారు. మంచి పనులు చేసి ప్రజల్లో సానుభూతి పొందాలి కానీ, ఇలా చేయడం కరెక్టు కాదు.

– నారాయణరెడ్డి, రామగిరి

పింఛన్ కావాలంటే ఆయన్ను కలవాలట!



కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగన్న

కొత్తచెరువు: వైఎస్సార్‌సీపీ తరఫున పనిచేశారన్న సాకుతో బండ్లపల్లికి చెందిన ఇద్దరు దళితులకు పింఛన్లు అందకుండా టీడీపీ నేత అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన దళితులు పక్కీరమ్మ గారి గంగన్న, నరసింహ అన్నదమ్ములు. వీరు వృద్ధాప్య పింఛన్‌దారులు. సార్వత్రిక ఎన్నికల రోజున జరిగిన చిన్న వివాదాన్ని టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ సురేష్‌నాయుడు మనసులో పెట్టుకున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో గంగన్న, నరసింహులుకు పింఛన్ ఇవ్వకుండా అధికారులను కట్టడి చేశారు. ఈ క్రమంలో పింఛన్ అందలేదన్న బెంగతో తిండీ తిప్పలు మానేసిన గంగన్న స్పృహ తప్పి కిందపడటంతో కాలు విరిగింది. పింఛన్ పొందాలంటే తనను కలవాలని సురేష్‌నాయుడు అంటున్నారని గంగన్న, నరసింహ తెలిపారు.

టీబీ డ్యాంలో 20 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో 20.851 టీఎంసీలకు నీరు చేరింది. సోమవారం ఉదయానికి 30,388 క్యూసెక్కుల నీరు డ్యాంలో చేరాయి. దీంతో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 20.851 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి. 1,633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1,599.47 అడుగు వరకు నీరు చేరాయి. అవుట్‌ఫ్లో 156 క్యూసెక్కులుగా నమోదవుతోంది. జలాశయానికి ఎగువన ఉన్న శివమొగ్గ, శృంగేరి, తీర్థనహళ్లి, ఆగుంబే తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్రకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

పుట్టపర్తి అర్బన్: ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 207 అర్జీలు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్జీదారులు సంతృప్తి చెందేలా గడువులోపు పరిష్కారం చూపాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

రైలు ఢీ కొని వృద్ధుడి మృతి

- మృతుడు భార్య హత్య కేసులో నిందితుడు

బత్తలపల్లి: మద్యం తాగేందుకు పింఛన్ డబ్బు ఇవ్వలేదన్న అక్కసుతో భార్యను హతమార్చి అజ్ఞాతంలోకి వెళ్లిన వ్యక్తి సోమవారం రైలు ఢీకొని మృతి చెందాడు. ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.... బత్తలపల్లి మండలం తంబాపురం గ్రామానికి చెందిన లక్ష్మమ్మను భర్త లక్ష్మన్న (68) మద్యం తాగేందుకు పింఛన్ డబ్బులు ఇవ్వలేదన్న అక్కసుతో ఈ నెల 6న రోకలి బండతో బాది హతమార్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి లక్ష్మన్న పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ధర్మవరం –చిన్నేకుంటపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి తిరుపతి ప్యాసింజర్ రైలు ఢీ కొనడంతో ఓ వృద్ధుడు మరణించినట్లు ధర్మవరం రైల్వే పోలీసులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం మృతుడి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు వెంటనే మృతుడిని లక్ష్మన్నగా నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు 'పురం' విద్యార్థులు



ఓవరాల్ చాంపియన్ ట్రోఫీతో విద్యార్థులు

హిందూపురం: ఈ నెల 6, 7వ తేదీల్లో పాండిచ్చేరి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన 5వ సౌత్ జోన్ పెన్కాక్ సిలాట్ పోటీల్లో హిందూపురానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పోటీల్లో పాల్గొన్న ఎం.తనీశ్వర్ రెడ్డి, కె.మీనా బంగారు పతకాలు సాధించారు. కె.ఈశ్వర్, కె.మధుర, ఎం.మదీహా, వి.శరణ్య వెండి పతకాలు దక్కించుకున్నారు. ఆర్.తన్విత రెడ్డి, ఎస్.నస్రిన్ కాంస్య పతకాలను సాధించారు. ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను రాష్ట్ర సౌత్ జోన్ సిలాట్ ప్రముఖులు పురిమిట్ల మనోజ్ సాయి, రాష్ట్ర కార్యదర్శి భరద్వాజ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ప్రెసిడెంట్ పి.రఫిక్ అహమ్మద్ అభినందించారు.

'అనంత'లో ఏఎఫ్‌టీఎస్ ఏర్పాటు

- వాహన ఫిట్‌నెస్ ధ్రువీకరణకు త్వరలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు
- అనంతపురం, నంద్యాల, తిరుపతి, చిత్తూరులో సాగుతున్న పనులు
- హిందూపురంలో రూ.2 కోట్లతో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్
- ముగిసిన టెండర్ ప్రక్రియ, త్వరలో పనులు ప్రారంభం
- రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎం.బసిరెడ్డి



రవాణా శాఖ అధికారులతో సమావేశమైన జాయింట్ కమిషనర్ ఎం.బసిరెడ్డి

హిందూపురం అర్బన్: వాహనాలకు సర్టిఫికెట్ జారీ చేసేందుకు త్వరలో అనంతపురంలో ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎం.బసిరెడ్డి తెలిపారు. సోమవారం హిందూపురం జిల్లా రవాణాశాఖ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం రవాణా శాఖ జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా తరచూ రోడ్లపై వాహన తనిఖీలు తనిఖీలు చేపడుతూ లైసెన్స్‌లు లేని వారిపై ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నెల రోజుల్లో ధర్మవరంలో రవాణాశాఖ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

రవాణాశాఖలో సేవలను పారదర్శకంగా అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రైవేట్ వ్యక్తులు, దళారులను ఆశ్రయించకుండా నేరుగా వాహనదారులే తమకు కావాల్సిన సేవలను వినియోగించుకునే వీలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే రవాణాశాఖలో ఆన్‌లైన్ ద్వారా 80కి పైగా సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీకి ఇప్పటికే ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లను అనంతపురం, చిత్తూరులో ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి, హిందూపురంలో త్వరలో ఏర్పాటు కానున్నాయన్నారు. హిందూపురంలో ట్రాక్ ఏర్పాటుకు రూ.2 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయన్నారు. టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. వాహన ఫిట్‌నెస్ ధ్రువీకరణకు సైతం త్వరలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు అందుబాటులో రానున్నాయన్నారు. తొలి విడత కింద అనంతపురం, నంద్యాల, తిరుపతి, చిత్తూరులో పనులు జరుగుతున్నాయన్నారు. చిత్తూరు జిల్లా నగరి, ధర్మవరంలో రవాణా ప్రాంతీయ కార్యాలయాలు మంజూరయ్యాయని, మరో నెల రోజుల్లో ధర్మవరం వేదిక రవాణా శాఖ సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఇకపై డిజిటల్ సేవలే

రవాణా శాఖలో తాజాగా కేంద్రం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వాహన్ సారథి సాఫ్ట్‌వేర్ వాడుతున్నామని, దీని ద్వారా దేశంలో ఎక్కడ వాహన రిజిస్ట్రేషన్ జరిగినా, వాహన రికార్డులు బదిలీ ఎక్కడికైనా సులువుగా బదలాయించుకునే అవకాశం ఉందన్నారు. వాహన డ్రైవింగ్, ఆర్‌సీ మొదలైన వాటి విషయంలోనూ 2023 ఆగస్టు వరకూ స్మార్ట్ కార్డులు జారీ చేశామని, ఆ తరువాత డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రవాణాశాఖ మంజూరు చేసే సర్టిఫికెట్లు డీజీలాకర్‌లో ఉంచుకుని తనిఖీల సమయంలో అధికారులకు చూపితే సరిపోతుందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు సంబంధించి 543 బస్సులు ఉండగా ఇప్పటి వరకూ 501 బస్సుల ఫిట్‌నెస్ పూర్తయిందన్నారు. మిగిలిన బస్సులను తనిఖీ చేసి పనికి రాని బస్సులను స్క్రాప్‌కు పంపేలా చర్యలు తీసుకుంటామన్నారు. 15 ఏళ్లు పైబడిన బస్సులను ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించబోమన్నారు. సమావేశంలో శ్రీసత్యసాయి జిల్లా డీటీసీ కరుణాసాగర్‌రెడ్డి, ఎంవీఐలు దాసరి సుబ్రహ్మణ్య మునివర ప్రసాద్, రాణి, జయశ్రీ, శివ శంకర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి



మృతుడు లక్ష్మీనారాయణ

బత్తలపల్లి: కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన సాకే లక్ష్మీనారాయణ (65) ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఆరేళ్లుగా సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై బత్తలపల్లికి వస్తూ గ్రామంలో నుంచి జాతీయ రహదారిపైకి చేరుకుని రోడ్డు క్రాస్ చేస్తుండగా, అనంతపురం నుంచి మదనపల్లి వైపుగా వెళుతున్న కారు ఢీకొంది. ప్రమాదంలో టీవీఎస్ వాహనం దాదాపు వంద అడుగుల దూరంలో ఎగిరిపడింది. లక్ష్మీనారాయణ సైతం గాలిలో ఎగిరి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కాగా, లక్ష్మీనారాయణకు భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'పోలీసు స్పందన'కు 35 వినతులు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 35 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్య తీవ్రత అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఫోన్ ద్వారా ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావు , డీసీఆర్బీ సీఐ శ్రీహర్ష పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశారు

అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.60 లక్షలు తీసుకుని మోసం చేశారంటూ ఎస్పీ మాధవరెడ్డికి కదిరికి నరసింహులు ఫిర్యాదు చేశారు. ఇంటర్ వరకు చదువుకున్న నరసింహులు, అనంతరం ఐటీఐ పూర్తి చేశాడు. ఈ క్రమంలో ముదిగుబ్బ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన కేతినేని లోకేష్... నరసింహులను కలసి మోడల్ స్కూల్‌లో అటెండర్ ఉద్యోగి ఇప్పిస్తానంటూ 2021లో రూ.2.60 లక్షలు తీసుకున్నాడు. అనంతరం ఆర్డర్ కాపీ చేతికిచ్చి ఉద్యోగంలో చేరాలంటూ తెలిపాడు. అయితే ఉద్యోగంలో చేరేందుకు వెళ్లిన సమయంలో తనకు నకిలీ ఆర్డర్ కాపీ ఇచ్చినట్లుగా తేలింది. దీంతో లోకేష్‌ను కలసి తన డబ్బు తనకు తిరిగి ఇవ్వాలని అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడని బాధితుడు వాపోయాడు. ఎలాగైనా తన డబ్బు తిరిగి ఇప్పించాలని ఎస్పీని వేడుకున్నాడు.



వృద్ధుడి సమస్య వింటున్న ఎస్పీ మాధవరెడ్డి

బిడ్డలను నా దరి చేర్చండి

తన బిడ్డలను తన వద్దకు చేర్చాలంటూ ఎస్పీ మాధవరెడ్డిని సోమవారం స్పందన కార్యక్రమంలో ఓ బాధితురాలు ఆశ్రయించింది. వివరాలు.. ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన సరస్వతికి అనంతపురం జిల్లా నార్పల మండలం దుగుమర్రి గ్రామానికి చెందిన ఈశ్వరయ్యతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెళ్లి జరిగి అత్తింట్లో కాలు పెట్టినప్పటి నుంచి అదనపు కట్నం భర్త వేధిస్తుండేవాడు. అయినా ఆమె సర్దుకుపోతూ వచ్చింది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం బతుకు తెరువు కోసం చిత్తూరుకు వెళ్లారు. అక్కడ మద్యం మత్తులో గొడవపడి సరస్వతిని కొడుతుంటే ఆమె అన్న అడ్డుకుని పుట్టింటికి పిలుచుకెళ్లాడు. అప్పటి నుంచి తన ఇద్దరు పిల్లలను ఇవ్వకుండా భర్త వేధిస్తూ వస్తున్నాడు. ఎలాగైనా తన పిల్లలను తనకు ఇప్పించి న్యాయం చేయాలని ఎస్పీని సరస్వతి వేడుకుంది. స్పందించిన ఎస్పీ మాధవరెడ్డి వెంటనే ధర్మవరం డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలి సమస్య వివరించి, పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు.

బొలెరో వాహనం బోల్తా

- 16 మంది కూలీలకు గాయాలు

బత్తలపల్లి: కూలీలతో వెళుతున్న బొలెరో వాహనం బోల్తాపడి 16 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం నార్శింపల్లికి చెందిన 16 మంది కూలీలు సోమవారం ఉదయాన్నే బొలెరో వాహనంలో నార్పల మండలానికి చీనీ కాయల కోతకు వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం తిరిగి అదే వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మాల్యవంతం నుంచి తాడిమర్రికి వెళ్లే ప్రధాన రహదారిలోని పెట్రోల్ బంకులో నుంచి ఉన్నఫలంగా రోడ్డుపైకి వచ్చిన కారును బొలెరో డ్రైవర్ తప్పించే ప్రయత్నంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. బొలెరో డ్రైవర్ గోవర్ధన్‌తో పాటు కూలీలు ధరణి, లక్ష్మీనారాయణమ్మ, ధనలక్ష్మి, లక్ష్మి, కుళ్లాయప్ప, శ్రావణి, జయరాం, నారాయణమ్మ, దస్తగిరమ్మ, పెద్దక్క, నాగేంద్రమ్మ, పార్వతి, శ్వేత, వీరనారమ్మ, లక్ష్మీదేవి గాయపడ్డారు. వీరిని స్థానికులు వెంటనే ఆటోల ద్వారా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ధరణి, ధనలక్ష్మి, నాగేంద్రమ్మ, వీరనారమ్మను అనంతపురానికి రెఫర్ చేశారు. మరికొందరు ఆర్డీటీ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. స్వల్ప గాయాలైన వారు చికిత్స అనంతరం ఇళ్లకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు ఆర్డీటీ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులతో ప్రమాద వివరాలు ఆరా తీశారు. అనంతరం ప్రమాదస్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన అందించాలని వైద్యులకు సూచించారు. ఈ మేరకు ఆయన స్థానిక కార్యాలయ సిబ్బంది హరీష్, డోలా రాజారెడ్డి, బీజేపీ నాయకులు ఆకులేటి వీరనారప్ప, గుజ్జల నారాయణస్వామి, టీడీపీ నాయకులు తాళ్లూరు సతీష్‌కుమార్, జనసేన మండల కన్వీనర్ పురంశెట్టి రవి తదితరులు ఆర్డీటీ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు.



బోల్తా పడిన బొలెరో వాహనం

నకిలీ ఎరువులు అమ్మితే కఠిన చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

తనకల్లు: నకిలీ ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏలూరు జిల్లా విజిలెన్స్ శాఖ ఎస్‌ఐ రంజిత్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏలు శివకుమార్, సత్యనారాయణ హెచ్చరించారు. తనకల్లు, కొక్కంటిక్రాస్‌లోని ఎరువుల దుకాణాలను సోమవారం వారు ఆకస్మిక తనిఖీ చేశారు. శ్రీసాయి చిన్నపరెడ్డి ఎరువుల దుకాణంలో రూ.96,600 విలువైన ఎరువులకు సంబంధించి స్టాక్ రిజిస్టర్‌లో సరైన వివరాలు లేకపోవడంతో వాటికి స్టాప్ సేల్స్ నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీహరినాయక్, రవీంద్ర, టెక్నికల్ ఏఓ నాజిర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో పట్టపగలే చోరీ

మడకశిర: పట్టణంలో పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిరలోని శాంతినగర్‌లో నివాసముంటున్న చంద్రశేఖరరెడ్డి... సోమవారం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి స్థానిక చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకం వేడుకలో పాల్గొనేందుకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలను బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి అందులో పిల్లల చదువుల కోసం దాచిన రూ.1.40 లక్షలు, 65 గ్రాముల బంగారు నగలు అపహరించుకెళ్లారు. ఆలయం నుంచి ఇంటికి చేరుకున్న అనంతరం చోరీ విషయాన్ని గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

- ఎన్నికల అనంతరం తొలి సమావేశం
- 11 మంది కొత్త ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ముగ్గురు మంత్రుల రాకకు ఏర్పాట్లు
- తరలిరానున్న రెండు జిల్లాల కలెక్టర్లు, ముఖ్య శాఖల అధికారులు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైన నేపథ్యంలో తొలిసారి జరగనున్న సర్వసభ్య సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షత వహించనున్నారు. రెండు జిల్లాల కలెక్టర్లు, సీఈఓ వైఖోమ్ నిదియాదేవితో పాటు 11 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ముగ్గురు మంత్రులు తొలిసారి జెడ్పీలో అడుగుపెట్టనున్నారు. దీంతో సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకోనుంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదుగురు జెడ్పీటీసీ సభ్యులు ఇప్పటికే కూటమిలోకి చేరారు. వీరికి తోడు ఇద్దరు ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలు తోడు కావడంతో ప్రతిపక్ష సభ్యుల సంఖ్య పెరిగింది. ఈ పరిస్థితుల్లో జరగనున్న జెడ్పీ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరగనున్నట్లు అంచనా. దీంతో భారీ బందోబస్తుకు సన్నాహాలు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్పీ గౌతమిశాలి కింది స్థాయి పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జెడ్పీ క్యాంపస్‌లోని కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు, పాత్రికేయులకు మాత్రమే అనుమతించనున్నారు. బయటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ కార్యాలయంలోకి అనుమతించబోరు.

రామగిరి మాజీ ఎంపీపీ దౌర్జన్యం

- కాంట్రాక్ట్ పనులు చేస్తుండగా సామగ్రి తరలింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంట్రాక్టర్



దౌర్జన్యంగా సామగ్రిని తరలించడంతో ఖాళీగా ఉన్న గోదాము ప్రదేశం

సాక్షి పుట్టపర్తి: రామగిరి మండలంలో తాము చెప్పిందే వేదం అన్నట్లుగా టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి మండలంలో ఏదో ఒకచోట దౌర్జన్యాలకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ప్రభుత్వ గోదాము పనులు అడ్డుకుని సామగ్రిని అక్రమంగా తరలించుకెళ్లారు. వివరాలు... రామగిరి రైతుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ గోదాము నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గత ఆరు నెలలుగా నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ పనులను నిలుపుదల చేశారు. సోమవారం పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్ వెళ్లాడు. ఆ సమయంలో మాజీ ఎంపీపీ (టీడీపీ) పరంధామ యాదవ్ అక్కడకు చేరుకుని పనులు అడ్డుకున్నాడు. దాదాపు రూ.4 లక్షల విలువ చేసే ఇసుక, కంకర, సిమెంట్, పెళ్లలు దౌర్జన్యంగా తరలించుకెళ్లాడు. ఘటనపై రామగిరి సీఐ శివాంజనేయులుకు కాంట్రాక్టర్ ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ.. నలభై రోజులుగా రామగిరి మండలంలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, వేధింపులు అధికమయ్యాయని, తిమ్మాపురంలో ఎన్నికల పోలింగ్ ఏజెంట్ అయ్యప్పను బెదిరించడంతో పాటు మండలంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులంటూ 250 పింఛన్లను తొలగించారన్నారు. పరిటాల కుటుంబం అండ చూసుకుని స్థానిక టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారని, ఇప్పటికైనా దౌర్జన్యాలకు స్వస్తి పలికి మండల అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు.

తండాల్లో మౌలిక వసతులు మెరుగుపరచండి

- ఇన్‌చార్జ్ కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు



ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో వడిత్యాశంకర్‌నాయక్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని గిరిజన తండాల్లో నెలకొన్ని సమస్యలు పరిష్కరించి, మౌళిక వసతులు మెరుగు పరచాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, విన్నవించారు. ముదిగుబ్బ మండలం జేకేపల్లి తండాకు రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి తండాకు మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శ్మశాన వాటికకు తగిన స్థలం కేటాయింపు, వసతి గృహాల్లో సమస్యలు, స్కూళ్లు, హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, జిల్లా కేంద్రంలో గిరిజన భవన్ ఏర్పాటు అంశాలను ప్రస్తావించారు. ఆయన వెంట మల్లికార్జున నాయక్, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రామ్, ఎస్‌ఓ శ్రీనివాస్‌నాయక్ తదితరులు ఉన్నారు.